క్లుప్తంగా

వన్యప్రాణులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న మురళీకృష్ణంనాయుడు

ఇచ్ఛాపురం రూరల్: వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణంనాయుడు అన్నారు. జాతీయ వన్యప్రాణుల వారోత్సవాలు సందర్భంగా తేలుకుంచి విదేశీ పక్షుల విడిది కేంద్రం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో తేలుకుంచి విదేశీ పక్షులకు నిలయంగా పేరు సంపాదించిందని, ఏటా మన గ్రామానికి వస్తున్న ఈ పక్షులను చిన్నపిల్లల్లా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మహిళా కన్వీనర్ పాతిర్ల సుభద్ర, మాజీ సర్పంచ్ మేరుగు సూర్యనారాయణ, కొంతాల కనకరాజు, డీఆర్‌వో ఐ.రాము, బీట్ అధికారులు పి.భానుమూర్తి, దుర్గాదేవి, టి.వెంకటేశ్వరరావు, జోగారావు, లక్ష్మణమూర్తి, సురేష్ ఉన్నారు.

ఉపాధ్యాయుడే నవసమాజ నిర్మాత



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో సంఘ నాయకులు

కవిటి: ఉపాధ్యాయుడు నవసమాజ నిర్మాతని కవిటి మండల సొండికుల సంక్షేమసంఘం అధ్యక్షుడు పాండవ రామారావు అన్నారు. సంక్షేమసంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని కవిటిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొండి కులానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మొగిలిపురి ఢిల్లేశ్వరరావు, సింహాచలపతి, కృష్ణారావు, కూర్మారావులతో పాటు ప్రస్తుతం ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న పాండవ సంతోష్, స్కూల్ అసిస్టెంట్ మేథ్స్ మొగిలిపురి రామకృష్ణ లను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు పాండవ చంద్రశేఖర్, మొగిలిపురి నాగేశ్వరరావు, మొగిలిపురి కృష్ణారావు, శీతారాం పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం



టెక్కలి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి దివ్వల పోలయ్య వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర స్థాయిలో అనుబంధ విభాగంలో స్థానం కల్పించేందుకు కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌తో పాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై ఎప్పటికప్పుడు పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

పోస్టల్‌శాఖ ఉద్యోగికి సత్కారం



మోహనరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పలాస: పలాస తపాలా శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తూ నిజాయితీ, క్రమశిక్షణకు మారుపేరుగా తామాడ మోహనరావు నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. కాశీబుగ్గలో పోస్టల్ అసిస్టెంటుగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన మోహనరావు దంపతులు ఆదివారం ఏర్పాటు చేసి కార్యక్రమంలో ఉద్యోగులు సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సోంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎన్‌ఎఫ్‌పీఈ రాష్ట్ర అధ్యక్షుడు కె.గణపతి, జిల్లా అధ్యక్షుడు యు.వి.రమణ, పి.దివాకర్, కె.చంద్రశేఖర్, జీడీఎస్ నాయకుడు నందికేశ్వరరావు, జె.జ్యోతేశ్వరరావు ఉన్నారు.

గొల్లమాకన్నపల్లిలో ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పలాస: గొల్లమాకన్నపల్లి గ్రామంలో మిషన్ ఆయుష్మాన్, ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యలలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ గొరకల గిరిబాబు ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. పలువురికి వివిధ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. యూపీవీ అధ్యక్షులు బొమ్మాళి శివ, గౌరవ అధ్యక్షుడు కుత్తుం ప్రకాశరావు, పి.గీతమ్మ, బి.చిన్నారావు, కె.లింగమూర్తి, జె.సీతారామయ్య, కె.వినోద్, వై.కామేశ్వరరావు, టి.వాసుదేవరావు, ఎం.వాసు పాల్గొన్నారు.

వరదొస్తే ఇన్నేశుపేటకు వణుకే..!

- గెడ్డలు ఉప్పొంగితే బాహ్య ప్రపంచానికి దూరంగా గ్రామం
- వర్షాలకు ముంపునకు గురౌతున్న పంట పొలాలు



నీట మునిగిన ఇన్నేశుపేట పంట పొలాలు

ఇచ్ఛాపురం రూరల్: వర్షాకాలం వస్తే ఆ గ్రామ ప్రజలు వణుకుపోతారు. చేతికి అందివచ్చిన పంట ఎక్కడ దక్కకుండా పోతుందోనన్న ఆందోళన అన్నదాత కంటిపై కునుకులేకుండా చేస్తుంది. ఇంటి గడప దాటి బయటకు వెళ్లలేని పరిస్థితిలో బిక్కుబిక్కుమంటూ చూడాల్సిన పరిస్థితి ఈ గ్రామ ప్రజలది. ఇంతలా భయపడుతున్న గ్రామం పేరు ఇన్నేశుపేట. ఇచ్ఛాపురం మండలం తులసిగాం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఈ గ్రామంలో 340 ఇళ్లు ఉండగా.. 1200 మంది జనాభా నివసిస్తున్నారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడే ఈ గ్రామ ప్రజలు వర్షాకాలంలో కంటిపై కునుకులేకుండా గడుపుతారు. ప్రధానంగా అక్టోబర్ నెలను వర్ష గండంగా పరిగణిస్తారు. అటు ఆంధ్రాలో వర్షం కురిసినా, ఇటు ఒడిశాలో కురిసినా తీవ్రంగా నష్టపోయేది ఈ గ్రామస్తులే. ఈ గ్రామానికి ఆనుకొని ప్రవహించే బాహుదా చానెల్ పద్మపురం గెడ్డ ఉప్పొంగితే ఈ గ్రామం బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అలాగే గ్రామం చుట్టూ వరద నీరు చేరడంతో పాటు ఇన్నేశుపేట, తులసిగాం గ్రామాలకు చెందిన 1176 ఎకరాలు నీటి ముంపున గురవుతాయి. తుఫాన్ల సమయంలో రెండు, మూడు రోజుల పాటు గ్రామస్తులు బయటకు రాని పరిస్థితి. వారం రోజుల పాటు వరద నీరు పంట పొలాల్లో ఉండి పోతుండటంతో పంటలను నష్టపోతుంటారు.

శాశ్వత పరిష్కారం ఏదీ?

దశాబ్దాల నుంచి ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంత మంది అధికారులు, పాలకులు వచ్చినా ఇన్నేశుపేట వాసుల కష్టాలు మాత్రం తీరడంలేదు. ప్రధానంగా ఇచ్ఛాపురం పట్టణ ప్రజలకు తాగు, సాగు నీరందిస్తున్న బాహుదా నదిలో వరద నీరు చేరిందంటే ఈ గ్రామస్తులకు ప్రమాదం పొంచి ఉన్నట్టే. ఒడిశాలోని భగలట్టీ ప్రాజెక్ట్ వద్ద ఒక్కగేటు ఎత్తినా గ్రామం జలమయమవుతుంది. బాహుదా చానెల్‌గా పిలుస్తున్న పద్మపురం (దండు) గెడ్డ తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈదుపురం బాహుదానదిలో కలుస్తోంది. వరదలు, తుఫాన్‌లు సంభవిస్తే గెడ్డ పరీవాహక ప్రాంతంలో ఉన్న పంట పొలాలు ముంపునకు గురికావాల్సిందే. గెడ్డకు ఇరువైపులా ముళ్ల పొదలు, ఇసుక మేటలు వేయడంతో వరద నీరు అటు గ్రామానికి, ఇటు పంట పొలాలాకు మళ్లిపోయి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే ఎం.వి.కృష్ణారావు చొరవతో వేసవి కాలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ధర్మపురం గెడ్డలో జంగిల్ క్లియరెన్స్, మట్టి దిబ్బలు, భారీ వృక్షాలు తొలగించడం మూలంగా ఐదారేళ్ల వరకు రైతులకు ముంపు సమస్య రాకుండా పోయిందని, ప్రస్తుత ప్రభుత్వాలు కనీసం ఈ దిశగా స్పందించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. పాలకులు స్పందించి నీటి ముంపు భయం నుంచి తమను శాశ్వతంగా కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

70 ఏళ్లుగా ఇదే తంతు..



నా చిన్నతనం నుంచి చూస్తున్నా.. బాహుదా నదిలో నీరు చేరిందంటే మా గ్రామానికి ముంపు సమస్య తప్పదు. నాకు ఉన్న ఎకరంన్నర పంట పొలాన్నే నమ్ముకొని జీవిస్తున్నాము. ఏటా వర్షా కాలంలో మాకు సమస్యలు తప్పడం లేదు. ప్రభుత్వం, అధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకుంటే మా గ్రామానికి మేలు చేసినవారు అవుతారు.

– దుంగు గంగయ్య, గ్రామ పెద్ద, ఇన్నేశుపేట

శాశ్వత పరిష్కారం చేపట్టాలి



భారీ వరదలు వచ్చిన సమయంలో మా గ్రామం బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. పంట పొలాలు రోజుల తరబడి నీటి ముంపులోనే ఉంటాయి. నాకున్న ఏడు ఎకరాలు ఏటా వరదలకు గురౌతుంటాయి. అప్పులు చేసి పంటలు పండించుకుంటే అవి చేతికి వచ్చే వరకు మాకు నమ్మకం కలగడం లేదు. గెడ్డలో పూడిక తీసి, జంగిల్ క్లియరెన్స్ చేస్తే తప్పా మాకు మనుగడ లేదు.

– ఇసురు యాదవరెడ్డి, రైతు సంఘ నాయకుడు, ఇన్నేశుపేట



ఉధృతంగా పారుతున్న ధర్మపురం గెడ్డ



జలదిగ్బంధంలో ఇన్నేశుపేట గ్రామం (ఫైల్)

పూడిలంక కష్టాలు పదిలం!



పూడిలంకకు పూర్తి కాని కాలినడక దారి

వజ్రపుకొత్తూరు: వరదలు వస్తే చాలు పూడిలంక వణికిపోతుంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా వీరి కష్టాలు మాత్రం తీరడం లేదు. వాటిని తీర్చేనాథుడే కరువైయ్యాడు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష నూతన కాలినడక రహదారి పనులకు శంకుస్థాపన చేసినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. దీంతో పూడిలంక వాసులకు రాకపోకలు పూర్తిగా నలిచిపోయాయి. గ్రామం జలదిగ్బంధంలో ఉంది. రేషన్, నిత్యవసరాలతో పాటు వైద్యానికి గ్రామస్తులు దూరమవుతున్నారు. గురువారం కురిసిన కుండపోత వర్షానికి వణికిపోయారు. ఏం చేయాలో తోచలేదు. గ్రామం చుట్టూ పీకల్లోతులో వరద నీరు చేరింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్లకే పరిమితమయ్యారు.

పోరాటాలతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం

- ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి



మాట్లాడుతున్న భానుమూర్తి

కవిటి: దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవిటిలో సంఘ మండలస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరల మాధ్యం నుంచి ఉద్యోగవర్గాల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలన్నారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పెండింగ్‌లోని డీఏలను అమలుచేసి వాటి ఆర్థిక ప్రయోజనం ఉద్యోగులకు కలిగేవిధంగా ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. డీఏ బకాయిలను చెల్లించాలన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా అధ్యక్షులు ఎం.మదన్ మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు పి.తిరుమల రావు, జి.భీమారావు, జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, రాష్ట్ర కౌన్సిలర్ జి.రాజేష్, మండల శాఖ ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు. అనంతరం కవిటి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా బి.లక్ష్మణమూర్తి, గౌరవాధ్యక్షులుగా ఆర్.కష్టారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.వంశీకృష్ణ, జి.రాంబాబు, కోశాధికారిగా పి.వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా కోళ్ల ప్రకాష్, దుర్యోధన ధొలాయ్, ఓ.లింగరాజు, ఎ.మనమ్మ, ఎ.తిరుపతి రావు, కార్యదర్శులుగా బొడ్డ జయరాం, మార్పు వంశీ, కందాన ధర్మారావు, బాగా కృష్ణమూర్తి, ఏడుకొండలు, అప్పలనరసమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికైన ప్రతినిధులతో జిల్లా అధ్యక్షులు ఎం.మదన్‌మోహన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

నాయకుల పరామర్శ



పరామర్శలు పార్టీ నాయకులు

కంచిలి: బూరగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కుటుంబానికి చెందిన తలగాన అప్పలమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మండల పార్టీ నేతలు మృతురాలు కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఉపాధ్యక్షుడు తలగాన తిరుపతిరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, నాయకులు లడ్డు కేశవపాత్రో, మడ్డు వెంకటరావు, మడ్డు వెంకటేశ్వరరావు, మండల యువజన అధ్యక్షుడు మడ్డు అభియాదవ్ ఉన్నారు.

పట్టణంలోకి రావాలంటే ముక్కు మూసుకోవాల్సిందే!



టెక్కలి ఆర్టీసీ డిపో వద్ద పేరుకుపోయిన చెత్త



టెక్కలి శివారు పలాస బైపాస్ రోడ్డు వద్ద చెత్త నిల్వలు

టెక్కలి: టెక్కలి పట్టణంలోకి ప్రవేశించాలంటే ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకుంది. ఒక వైపు ఆర్టీసీ డిపో.. మరో వైపు పలాస బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో పట్టణానికి ఆనుకుని చెత్త నిల్వలు వేయడంతో డంపింగ్ యార్డుగా మారుతున్నాయి. దీంతో పట్టణానికి వచ్చే పోయేవారంతా పంచాయతీ నిర్వాకంపై విమర్శలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రత్యేక డ్రైవ్ పేరుతో పలు వీధుల్లో మురుగు కాలువలను శుభ్రం చేయడం పక్కన పెడితే.. పట్టణానికి ఆరంభం.. శివారు ప్రాంతాల్లో డంపింగ్ యార్డుల వలన పట్టణానికి రూపు రేఖలు మారిపోతున్నాయని స్థానికులు అంటున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సంతబొమ్మాళి: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. డీపీఎస్ రోడ్డు నుంచి ఉద్దండపాలెం వరకు బీటీ రహదారి, డీపీఎస్ రోడ్డు నుంచి పాలతలగాం వరకు బీటీ రహదారి వరకు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు భవనాలను ప్రారంభించారు. అనంతరం బోరుభద్ర ప్రధాన రహదారిని పరిశీలించారు. ఆయనతో పాటు అధికారులు, కూటమి నాయకులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

నందిగాం: మండల కేంద్రమైన నందిగాంలో ఇటీవల క్యాన్సర్‌తో మృతి చెందిన మట్ట ఈశ్వరరావు కుటుంబానికి టెక్కలికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ధవళ గిరిబాబు సౌజన్యంతో ఆర్థిక సాయం, నిత్యవసర వస్తువులను ఆదివారం అందజేశారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కూరాకుల యాదవ్, పి.బాలక్రిష్ణ, కె.అరుణ్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



నందిగాం: హరిదాసుపురం పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు తలగాన తవుడు (80) వృద్ధాప్య సమస్యలతో ఆదివారం మృతి చెందారు. హరిదాసుపురం పంచాయతీకి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా పని చేశారు. ఆయన మృతికి సర్పంచ్ కణితి ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కణితి తరిణమ్మ, నాయకులు నారాయణమూర్తి, రామచంద్రుడు సంతాపం తెలియజేశారు.

సేవా సంఘం నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

కవిటి: చిన్నకర్రివానిపాలెం మత్స్యకార గ్రామంలో దుర్గా గణేష్ సేవా సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికై ంది. అధ్యక్షుడుగా సూర్పి రమేష్, సెక్రటరీగా చీకటి బోసు, ఉపాధ్యక్షులుగా ఎస్.ముకుందా, కోశాధికారిగా బడే జయబాబు ఎన్నికయ్యారు.

ఫ్యాప్టో ధర్నాకు సంపూర్ణ మద్దతు

ఇచ్ఛాపురం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల ఏడో తేదీన రాష్ట్రస్థాయిలో ఫ్యాప్టో చేపట్టనున్న ధర్నాకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని స్టేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్‌ఎస్‌టీఏ) జిల్లా అధ్యక్షుడు సప్పటి మల్లేష్, ప్రధాన కార్యదర్శి పంచాది గోవిందరాజు ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని, పిట్మెంట్‌తో పాటు పీఆర్‌సీ ఇస్తామని, మధ్యంతర భృతి ప్రకటిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు.

పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్!



ఈ ఫొటోలో దట్టంగా కనిపిస్తున్న జంగిల్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందంటే నమ్మశక్యం కాదు. అయితే ఇది నిజమే. టెక్కలి మేజర్ పంచాయతీ సోగ్గాడిపేట వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా దట్టంగా జంగిల్ అల్లుకుని విద్యుత్ శాఖా సిబ్బంది నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎక్కడ ఎటువంటి విద్యుత్ సమస్యలు కలుగుతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలకు అల్లుకుని ఉన్న జంగిల్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. –టెక్కలి

యువతరం సేవా సమితి ఔదార్యం



వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం గోపినాధపురం గ్రామానికి చెందిన దున్న హేమారావు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పూండికి చెందిన యువతరం సేవా సమితి అండగా నిలిచింది. 25 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తానికి సబంధించిన చెక్కును హేమారావుకు ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సేవా సమితి అధ్యక్షుడు చింత మురళీ, గొరకల సునీల్, గర్తం పుష్పలత, కె.నారాయణరావు, కెంగువ రాంబాబు, ఎ.లక్ష్మణరావు, రవిచంద్ర పండా, వంశీ, సాయి, వెంకటేష్, జోగారావు ఉన్నారు. – వజ్రపుకొత్తూరు

మొక్కలు నాటివేత



మందస మండల కేంద్రం సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా అభివృద్ధి కమిటీ (గో గ్రీన్) ఆధ్వర్యంలో ఆదివారం మెయిన్ రోడ్డు డివైడర్ ఖాళీస్థలాల్లో మొక్కలను నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కమిటీ ప్రతినిధులు గిన్ని తిరుపతి రెడ్డి, శానాపతి కిశోర్ కోరారు. నెలలో ఒక ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రొఫెసర్ పట్నాల మోహన్ ఆచార్య, సోమానాథ్, శ్రీనివాస పాడి, కోదండ, నిర్మల పాణిగ్రహి, తోలత అముల్య, మేడిమి శ్రీనివాసరావు, బుడకల రవి, అల్లాడ తాతయ్య, లావేటి ఆనంద్ పాల్గొన్నారు.

–మందస

విద్యుత్ స్తంభానికి కర్ర సపోర్టు!



ఆరికివలస గ్రామంలోని ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభం ఒరిగిపోవడంతో కర్రను సపోర్టుగా. అయితే ఏ క్షణంలోనైనా స్తంభం కూలిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సమస్యను విద్యుత్‌శాఖ సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడంలేదంటున్నారు. పమాదం జరగక మునుపే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–సంతబొమ్మాళి

అపూర్వ కలయిక



ఒకేవేదికపై పూర్వవిద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు ఉన్నత పాఠశాలలో 2011–12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పదమూడేళ్ల తరువాం ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులను సత్కరించి వారితో సంతోషాన్ని పంచుకున్నారు

అనుబంధ విభాగంలో లోకనాథానికి చోటు



నందిగాం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగం కమిటీలో నందిగాం మండల కేంద్రానికి చెందిన అక్కురాడ లోకనాథానికి చోటు లభించింది. పార్టీ ఆర్టీఐ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆయనను నియమించారు. రాష్ట్ర అనుబంధ కమిటీలో స్థానం కల్పించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు సహకరించిన టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌కు, నందిగాం మండల నాయకులకు లోకనాథం కృతజ్ఞతలు తెలియజేశారు.